క్లుప్తంగా

బసవమందిర స్మారక సత్రానికి శంకుస్థాపన



తెనాలిటౌన్: తెనాలి పట్టణం ఆరోవ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న కొల్లిపర బసవ మందిర స్మారక సత్రానికి సోమవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శంకుస్థాపన చేశారు. గుడి నిర్మాణానికి రూ.ఐదు లక్షల విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ



తెనాలిఅర్బన్: నల్లగండ్ల పెదరంగయ్య ఐదోవ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లగండ్ల రవిచంద్రబాబు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్య వేదిక సేవాట్రస్ట్ అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్‌ల సంయుక్త ఆధ్వర్యంలో చెంచుపేటలోని అమ్మ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం దుస్తులు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ యాతాటి అనిల్, సేవా ట్రస్ట్ పట్టణ అధ్యక్షుడు జూపల్లి వంశీ, రూరల్ అధ్యక్షుడు కుర్రా జశ్వంత్ యాదవ్, సల్మాన్, కనపర్తి శశి, పసుపులేటి హర్ష, తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన



తెనాలిఅర్బన్: హెల్త్ హాస్పటల్ తెనాలి వారి ఆధ్వర్యంలో పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద సోమవారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. హెల్త్ హాస్పటల్ వైద్యులు, బ్యాంకు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు కంటి, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్నవారికి కూడా పరీక్షలు జరిపి మందులను పంపిణీ చేశారు. హెల్త్ హాస్పటల్ సీఈవో గిరిబాబు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బ్రాంచ్ మేనేజర్ సిహెచ్‌వి.మనోహర్ పాల్గొన్నారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ

గుంటూరు ఈస్ట్: రెండు వర్గాలు ఘర్షణపడ్డ ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తకాలనీలో నివసించేర ఆమకృష్ణకు దుర్గానగర్‌కు చెందిన సాయికృష్ణ ఫోన్ చేశాడు. రామకృష్ణ ఫోన్ మరొకరికి ఇచ్చి తాను లేనని చెప్పించాడు. ఈనేపథ్యంలో సాయికృష్ణ, తరుణ్, సుందరయ్యలు రామకృష్ణ వద్దకు వచ్చి గొడవపడి కొట్టారు. రామకృష్ణ తన మిత్రుడు సాయి వెంటబెట్టుకుని వెళ్లి ముగ్గురిపై దాడిచేసి కొట్టారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

- ఎమ్మెల్యే శివకుమార్
- కొలకలూరులోగడప గడపకు మన ప్రభుత్వం

తెనాలిటౌన్: కొలకలూరులో మెయిన్ రోడ్డు, ఇతర రోడ్డుల్లో ఉన్న ఆక్రమణకు తొలగింపునకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. ఆక్రమణల వలన మురుగు నీరు పారుదల కాకపోవడంతో రోడ్లపైకి నీరు చేరడం వల్ల ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రూరల్ మండలం కొలకలూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఐదోవ రోజు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, అధికారులు, వలంటీర్లతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను సచివాలయ సిబ్బంది నమోదు చేసుకున్నారు. మురుగు కాల్వలకు డ్రైయిన్స్ ఏర్పాటు చేయాలని, కల్వర్టులు నిర్మించాలని, విద్యుత్ లైన్లు మరమ్మతులు చేయాలని, స్తంబాలు ఏర్పాటు చేయాలని, ఇళ్ళ స్థలాలు ఇప్పించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. డ్రైయిన్స్, కల్వర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలుమంజూరు చేయిస్తామని శివకుమార్ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ఇప్పటికి 1200 ఇళ్ళకు వెళ్ళమని ప్రతి ఇంట్లో సంక్షేమం అందుతున్నందు వల్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. అర్హులు ఉన్న ప్రతి ఒక్కరూ ఇళ్ళ స్థలాలకు అర్జీలు అందజేసినట్లయితే మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సంక్షేమం పొందిన ప్రతి ఒక్కరూ రాబోయే ఎన్నికల్లో తమకు ఓటు వేస్తామని గర్వంగా చెబుతున్నారని తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 600 హామీలను అమలు చేయలేదని, కమిషన్ పేరిట జాప్యం చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి పకడ్బందిగా అమలు చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు చెప్పేవని ప్రజలు నమ్మడం లేదని తెలిపారు. రాష్ట్రం శ్రీలంక అవుతుందని ప్రచారం చేసిన చంద్రబాబు, టీడీపీ నాయకులు ప్రచారం చేస్తున్నారని, జగన్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల పట్ల ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. సంక్షేమ క్యాలెండర్‌ను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో 160 సీట్లతో గెలుపొంది ప్రభుతాన్ని ఏర్పాటు చేస్తామని శివకుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు నాగదేవిక, కాలిశెట్టి ఫణీకుమార్, డీసీఎంఎస్ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, పార్టీ నాయకులు బర్తిపూడి బాపిరాజు, కార్తికేయ, ధూళ్ళ శ్రీనివాసరావు, పినపాటి అనిల్, ప్రసాదం సురేష్, మల్లవరపు బుల్లయ్య, విజయ్, అంచె రోశయ్య, తులాబంధుల లక్ష్మీకోటేశ్వరరావు, అమీర్ బాషా, నాగూర్, షేక్ జిలానీ, జానీ, వీరారెడ్డి, లక్ష్మీరెడ్డి, కాలిశెట్టి సుబ్బారావు, పొమర్తి సుబ్బారావు, ప్రసాదం రాధారావు, ఎలక్ట్రికల్ ఏఈ వసంతరావు, పంచాయతీ కార్యదర్శి వైవిడి.ప్రసాద్, వీఆర్వో సురేష్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్



గాయపడిన వృద్ధుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

కార్మికులకు అండగా ఉంటాం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య మలేరియా విభాగ కార్మికుడు బండి రాజు కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెక్ ను సోమవారం కమిషనర్ చాంబర్‌లో బయాలజిస్ట్ మధుసూదన్‌తో కలిసి కమిషనర్ అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందన్నారు. ప్రజారోగ్య మలేరియా విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహించే బండి రాజు ఇటీవల కాలంలో అనారోగ్యం వలన మరణించారని, ఆయన భార్య రమణకు ఎక్స్ గ్రేషియా రూ.2 లక్షల చెక్ ని అందించామన్నారు. నగరపాలక సంస్థ నుంచి అందాల్సిన పరిహారాలు, పి.ఎఫ్. త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులను, సూపరింటెండెంట్లను ఆదేశించారు. కార్మికులు కూడా తమ సమస్యల పై ప్రతి గురువారం జరిగే ఉద్యోగుల గ్రీవెన్స్‌లో అర్జీలు, ఫిర్యాదులు అందిచవచ్చని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చెక్కు అందజేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

డిప్లమో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ఆర్‌వీఐటీ కళాశాల వైస్ చైర్మన్ గొట్టిపాటి మస్తాన్ చౌదరి

చేబ్రోలు: డిప్లమో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆర్‌వీ ఐటీ కళాశాల వైస్ చైర్మన్ గొట్టిపాటి మస్తాన్ చౌదరి అన్నారు. చేబ్రోలులోని కళాశాలలో సోమవారం డిప్లమో మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిప్లమో కోర్సులో ప్రతిభ కనబరిచి, అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సన్మానించారు. నగదు బహుమతులను అందజేశారు. డిప్లమో విద్యార్థులు ఈ ఏడాది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి రాష్ట్రంలో మూడో స్థానంలో, జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్లు కళాశాల డైరెక్టర్ మాలెపాటి శ్రీనివాస్ తెలిపారు. ప్రిన్సిపల్ దూళ్ల శ్రీదర్, వైస్ ప్రిన్సిపల్ పట్టాభి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైస్ చైర్మన్ మస్తాన్ చౌదరి

దోమల నివారణకు ఫాగింగ్

తాడికొండ: వర్షాకాలం దోమల వృద్ధి పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యలలో భాగంగా గ్రామంలో ఫాగింగ్ చేయిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం నుంచి ప్రాంతాల వారీగా ఫాగింగ్ యంత్రం సాయంతో మందును పిచికారీ చేయిస్తున్నామన్నారు. కాలువల్లో నీటి నిల్వలను మురుగు నీటి మళ్లింపు ప్రక్రియతో పాటు దోమల మందు పిచికారీ చేయించనున్నట్లు ఆయన తెలిపారు.

ఫిర్యాదులపై స్పందన ఉండాలి

- పునరావృతమైతే విభాగాధిపతులు నేరుగా పరిశీలించాలి
- గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులు రీ ఓపెన్ అయితే విభాగాధిపతులే నేరుగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత జగనన్నకు చెబుదాం, స్పందన పోర్టల్, ఈ.ఆర్.పి., వాట్సప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులతో, సంబంధిత సిబ్బందితో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాంకు అందే ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీలకై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. స్పందన అర్జీల అప్ డేట్స్‌ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 35 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 6, ఇంజినీరింగ్ విభాగానికి 20, రెవెన్యూ విభాగానికి 3, ప్రజారోగ్య విభాగానికి 3, ఉపా సెల్ విభాగానికి 3 ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాస్, డి.రవీంద్ర, ఎస్.ఈ. భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్ పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి

నెహ్రూనగర్: బడిఈడు పిల్లలందరూ తప్పనిసరిగా సంబంధిత పాఠశాలల్లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి నగరపాలక సంస్థ నోడల్ అధికారులను, విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో నగరంలో బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చే కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి సచివాలయంలో 5 ఏళ్ల నుండి 18 ఏళ్లలోపు పిల్లలు ఎవరైతే బడికి వెళ్లడం లేదో రెండు రోజుల్లో వివరాలను ఎడ్యుకేషన్ కార్యదర్శుల ద్వారా సేకరించాలని నోడల్ అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ నుంచి ప్రత్యేకంగా సీఆర్పీలు, అధికారులు నగరపాలక సంస్థ నోడల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. పిల్లల్లో అసలు బడికి వెళ్ళని వారు, డ్రాప్ అవుట్స్‌ను వేరుగా వివరాలు తీసుకొని చైల్డ్ ఇన్ఫో లో అప్‌లోడ్ చేయాలన్నారు. నగరంలో బడికి వెళ్లని వారిలో ర్యాగ్ పికర్స్ పిల్లలు, వలసలు వచ్చిన వారి పిల్లలపై నోడల్ అధికారులు, డెప్యూటీ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెండు రోజుల్లో పిల్లల సర్వే పూర్తి చేయాలని, నోడల్ అధికారుల వారీగా కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకుని, రోజువారీ నివేదిక ఇవ్వాలన్నారు. గుంటూరు నగరంలో ఏ ఒక్కరూ బడి ఈడు వారు బడికి వెళ్లకుండా ఉండకూడదని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాస్, డి.రవీంద్ర, ఎస్.ఈ. భాస్కర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంఈఓలు వెంకటేశ్వర్లు, నాగేంద్రమ్మ, జ్యోతి కిరణ్ పాల్గొన్నారు.

సస్పెన్షన్ కు గురైన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో వివిధ కారణాల చేత సస్పెండ్ అయిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం నగర కమిషనర్ చాంబర్ నందు కమిషనర్ కీర్తి చేకూరిని కలిసి వినతి పత్రం అందజేశారు. సస్పెండ్‌కు గురైన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు చాంద్ భాషా తెలిపారు.

చిరస్మరణీయుడు గిడుగు రామూర్తి

లక్ష్మీపురం: గిడుగు రామూర్తి నిర్వహించిన తెలుగు వ్యవహారిక భాషోద్యమం వల్లనే ఏ కొద్ది మందికో పరిమితమైన చదువు వ్యవహారిక భాషలో కొనసాగి అందరికీ అందుబాటులోకి వచ్చిందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గిడుగు రామూర్తి జయంతి సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ సాహితీవేత్త ముప్పాళ్ళ వి.ఎస్ ప్రసాదరావు, రచయిత్రి ఎ.వి.కె సుజాత మాట్లాడుతూ తెలుగు భాషా సోయగం చూసి తన్మయులు కాని వారుండరని, తెలుగు భాషలో ఉన్నన్ని సాహితీ ప్రక్రియలు మరే భాషలో లేవన్నారు. అనంతరం రాజశేఖర్, పోతురాజు, భాగ్యలక్ష్మీ, నారాయణ ప్రసంగించి నివాళులర్పించారు. జాతీయ నటపురస్కార గ్రహీతలకు అభినందలు జాతీయ ఉత్తమ నట పురస్కారానికి అల్లు అర్జున్ నూటికి నూరు శాతం అర్హుడేనని, తెలుగు సినీ పరిశ్రమ యావత్తు గుండెలకు హత్తుకుని జేజేలు పలకటం ఆయన నటనకు నిదర్శనమని రంగ స్థల నటుడు, గాయకుడు ఎం.ఘన శ్యామాచార్యులు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం జాతీయ నటపురస్కార గ్రహీతలకు అభినంద సభ నిర్వహించారు.

సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

మంగళగిరి: పెంచిన నిత్యావసర వస్తువులు గ్యాస్, పెట్రోల్, డీజిల్, మందులు, బియ్యం, నూనెలు, విద్యుత్ చార్జీల ధరలను తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సమరభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి అన్నారు. సోమవారం మండలంలోని నీరుకొండలో సమరభేరి కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీపీఎం పిలుపు మేరకు నేటి నుంచి సెప్టెంబరు నాలుగవ తేదీ వరకు సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అధిక ధరలకు వ్యతిరేకంగా రాజధాని గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.భాగ్యరాజు, తోకల కృష్ణారావు పాల్గొన్నారు.

'స్పందన'కు 11 ఫిర్యాదులు

రేపల్లె రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 11 అర్జీలు అందినట్లు కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి జాన్‌పీటర్ చెప్పారు. చెరుకుపల్లిలోని ప్రధాన కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం తొలగించే ప్రయత్నాన్ని నిలువరించాలని జై భీమ్ భారత్ పార్టీ నాయకుడు దోవా రమేష్ రాంజీ వినతిపత్రం అందజేశారని తెలిపారు. అమర్తలూరు నుంచి 2, నగరం నుంచి 1, కొల్లూరు నుంచి 2, రేపల్లె నుంచి 2, భట్టిప్రోలు నుంచి 1, కొల్లూరు నుంచి 1, పోలీసు కేసుకు సంబంధించి 1 చొప్పున అర్జీలు అందాయన్నారు. సమస్యలను పరిశీలించి, ఆయాశాఖల ద్వారా పరిష్కరించటం జరుగుతుందన్నారు.

విప్లవకారులకు రుణపడి ఉంటాం

రేపల్లె: ప్రజల సమస్యల పరిష్కారంలో నిరంతరం పోరాటాలు జరిపి, ప్రాణ త్యాగం చేసిన విప్లవకారులకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటారని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. విద్యుత్ ఉద్యమంలో 2000లో పోలీసు కాల్పులో మృతిచెందిన అమరవీరులు రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామికి స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. పెరుగుతున్న విద్యుత్ భారాలపై ప్రజలు ఉద్యమాల్లో ముందుకు రావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యుత్ పాలసీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రాయితీలు కూడా ప్రజలకు అందకుండా అన్ని రకాల విద్యుత్ చార్జీలు పెంచాలని సంస్కరణలు అమలుచే సేందుకు సిద్ధమవుతోందన్నారు.
అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆశీర్వాథం, కేవీ లక్ష్మణరావు, జె.ధర్మరాజు, డి.శ్రీనివాసరావు, సిహెచ్.ఆగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువరానివి

తెనాలిఅర్బన్: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేసిన పోరాటంలో అశువులుబాసిన అమరవీరుల త్యాగాలు మరువరానివని సీపీఎం తెనాలి డివిజన్ కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ కొనియాడారు. విద్యుత్ ఉద్యోగులు 2000 సంవత్సరంలో ఆగస్టు 28న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో చేస్తున్న పోరాటంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో మరణించిన ఉద్యోగుల సంస్మరణ సభను చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోరాటంలో 25వేల మందికి పైగా ఉద్యోగులు జైలు పాలయ్యారని, అనేక మంది గాయపడ్డారని గుర్తు చేశారు. ముందుగా వారి మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో సీపీఎం నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, రావూరి శివకృష్ణ, బ్రహ్మారెడ్డి, కె.రవికుమార్, జి.వెంకటసుబ్బయ్య, చుక్కపల్లి శేషగిరిరావు, ఈశ్వరి, దుర్గాప్రసాద్, సాయి, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం డివిజన్ కార్యదర్శి బాబూ ప్రసాద్

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు సారె సమర్పణ

మంగళగిరి: నగరంలోని కొత్త మంగళగిరిలో వేంచేసియున్న పోలేరమ్మ అమ్మవారికి సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో పసుపు, కుంకుమలతో పాటు సారె సమర్పించారు. తొలుత మహిళలు పెద్ద సంఖ్యలో పసుపు, కుంకుమ, సారెను తీసుకుని మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా బయలుదేరి నాగారమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి షరాఫ్ బజారు, మెయిన్ బజారు మీదుగా లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం మీదుగా తిరిగి పోలేరమ్మ అమ్మ వారి దేవాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మ వారికి ముత్తయిదువులు నైవేద్యంతో పాటు పసువు, కుంకుమలతో పాటు సారె సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ప్రతినిధులు చింతక్రింది కనకయ్య, గుత్తికొండ ధనుంజయరావు, దామర్ల కుబేరస్వామి, గంజి రవీంద్రనాథ్, రామనాథం పూర్ణచంద్రరావు, వంగర లక్ష్మయ్య, జొన్నాదుల భిక్షారావు, వెనిగళ్ల హనుమంతరావు, కొల్లివేణు, జంజనం శ్రీనివాసరావు, వెనిగళ్ల భాగ్యలక్ష్మి, జంజనం నందకుమారి, గోలి వెంకట శ్రీదేవి పాల్గొన్నారు.



పసుపు, కుంకుమ, సారెతో పోలేరమ్మ అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న ముత్తయిదువులు

సత్తా చాటిన జీజీహెచ్ నర్సింగ్ సిబ్బంది

గుంటూరు మెడికల్: హైదరాబాద్‌లోని బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో ఈ నెల 25, 26 వ తేదీల్లో జాతీయ ఆంకాలజీ నర్సింగ్, సింపొజియం జరిగింది. ఈపోటీల్లో గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్ నర్సింగ్ సిబ్బంది తమ సత్తా చూపారు. సదస్సులో దేశ వ్యాప్తంగా హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు 1200 మంది పాల్గొన్నారు. గుంటూరు నాట్కో క్యాన్సర్ కేంద్రం నుంచి ఏడుగురు హాజరయ్యారు. క్యాన్సర్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ టి.వి. శివరామకృష్ణ ఆధ్వర్యంలో హాజరైన గుంటూరు జీజీహెచ్ నర్సింగ్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందుకున్నారు. సోమవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ ను నర్సింగ్ సిబ్బందిక కలిసి తమ విజయ గాధను పంచుకున్నారు. పోస్టర్ ప్రెజెంటేషన్‌లో హెడ్ నర్సు దాసరి రోజ్‌రాణి, జి. గౌరీ కల్యాణి, కె. రాజ్యలక్ష్మి బహుమతులు సాధించారు. క్విజ్ పోటీల్లో స్టాఫ్ నర్సులు జి.ఉషారాణి, కె.వెంకట సుబ్బమ్మలకు ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ నర్సింగ్ సిబ్బంది ప్రశంస పత్రాలతో పాటు నగదు బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం హెడ్‌నర్సు రోజ్‌రాణి ఆధ్వర్యంలో రూ. 5 వేలు నర్సింగ్ సిబ్బంది అందజేశారు. ఆసుపత్రిలో పనిచేస్తూ వారికి వచ్చిన నగదును తిరిగి ఆసుపత్రి కోసం ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని పాల్గొన్నారు.




నర్సింగ్ సిబ్బందిని అభినందిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

జీవ్ దయ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

గుంటూరు మెడికల్: జీవ్ దయ ఫౌండేషన్ నిర్వాహకులు సోమవారం గుంటూరు జీజీహెచ్ గైనకాలజీ వైద్య విభాగానికి రూ. 50 వేలు విలువ చేసే వైద్య పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ గైనకాలజీ విభాగాలకు ఈ పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సేవ దృక్పథంతో వైద్య పరికరాలు అందించిన జీవ్ దయ ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.జయంతి మాట్లాడుతు గర్భిణులకు కాన్పుల సమయంలో ఇబ్బందులు పడకుండా, అధిక రక్త స్రావం జరగకుండా నివారించేందుకు అత్యాధునిక వైద్య పరికరాలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. సంస్థ అందజేసిన వైద్య పరికరాలను సూపరింటెండెంట్ చేతుల మీదుగా గైనకాలజీ విభాగానికి సరఫరా చేశారు. కార్యక్రమం లో డాక్టర్ వి.అరుణ, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ దుర్గాదేవి, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నిజాంపట్నం: అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ జెడ్పీటీసీ ప్రసాదం వాసుదేవ అన్నారు. బావాజీపాలెంలో ఇటీవల అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన షేక్ షరీఫ్ కుటుంబానికి సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాదం వాసుదేవ మాట్లాడుతూ నిజాంపట్నం జెడ్పీ హైస్కూల్లో 1988–89లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు టైటాన్స్ బ్యాచ్ ఏర్పాటు చేసి, ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నారని చెప్పారు. ఈ బ్యాచ్ విద్యార్థులు షరీఫ్ కుటుంబానికి రూ.11వేల ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో టైటాన్స్ బ్యాచ్ ఎప్పుడూ ముందుంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నజీర్ అహ్మద్, సలీమ్, నాగేశ్వరరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రసాదం వాసుదేవ, సర్పంచ్ నజీర్ అహ్మద్

పారదర్శకంగా ఓటరు జాబితా ఆడిట్

కొల్లూరు : ఓటరు జాబితా సమగ్ర సవరణ ఇంటింటి సర్వే పూర్తయిన నేపథ్యంలో ఆడిట్ ప్రక్రియను అధికారులు చేపట్టారు. జిల్లా ఆడిట్ అధికారిణి కె.పద్మజ నేతృత్వంలో సిబ్బంది సోమవారం కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో పోలింగ్ బూత్‌ల వారీగా ఓటరు జాబితాలను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి.. అక్కడ ఓటర్లు ఉంటున్నదీ.. లేనిదీ విచారణ జరిపారు. ఓటరు జాబితా పారదర్శకంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఉండేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆడిట్ ప్రక్రియ చేపట్టిన అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఓటరు జాబితాలను ఆడిట్ చేస్తున్న అధికారిణి పద్మజ, సిబ్బంది